క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మదనపల్లె : విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం పట్టణంలో పాక్షికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఆపరేషన్ ఈఈ గంగాధరం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రెండుగంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

కాపుల అభివృద్ధే లక్ష్యం


కలప రవి

పీలేరు : కాపుల అభివృద్ధే లక్ష్యమని జాతీయ కాపు సంఘం రాయలసీమ కన్వీనర్ రవి పేర్కొన్నారు. జాతీయ కాపు సంఘం రాయలసీమ కన్వీనర్‌గా పీలేరుకు చెందిన కలప రవిని నియమిస్తూ ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కర్ణ మురళీకృష్ణనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. రాయలసీమ కన్వీనర్‌గా ఎన్నికైన రవిని పలువురు అభినందించారు.

భూ సమస్యలు పరిష్కరించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల భూ సమస్యలను పరిష్కరించాలని బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లికార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ శ్రీరాములు నాయక్‌కు బీఎస్పీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. భూ సమస్యలను పరిష్కరించే దిశగా రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఇన్‌చార్జితో పాటు నియోజకవర్గ అధ్యక్షుడు సోమశేఖర్, నరసింహులు, రమణ, పెద్దన్న తహసీల్దార్‌కు విన్నవించారు.

పీలేరు ఏపీఓగా అశోక్ రెడ్డి


అశోక్‌రెడ్డి

పీలేరు : ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పీలేరు ఏపీఓగా అశోక్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. వి.కోటలో ఏపీఓగా పని చేస్తున్న అశోక్‌రెడ్డి బదిలీపై పీలేరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పనులు వేగవంతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి


సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : పేద ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. పట్టణంలోని త్యాగరాజువీధికి చెందిన సయ్యద్‌ఖాదర్‌బాషా, నసీబ్‌జాన్‌ల కుమార్తె తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో తల్లిదండ్రులు వైద్యఖర్చులకు సంబంధించి సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో వారికి మంజూరైన రూ.25వేల చెక్కును ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, కౌన్సిలర్ తులసీరామకృష్ణతో కలసి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యం కోసం ఖర్చు చేసుకున్న పేదలు దరఖాస్తు చేసుకున్న వెంటనే సీఎం సహాయనిధి మంజూరు చేయిస్తూ వారికి అండగా నిలుస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇంతియాజ్, బాబా, మల్లికార్జుననాయుడు, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఈగా విఠల్‌ప్రసాద్

బి.కొత్తకోట: హంద్రీనీవా ప్రాజెక్టు మదనపల్లె సర్కిల్–3 ఎస్‌ఈగా విఠల్‌ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ కమిషనరేట్‌లో ఈఈగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఎస్‌ఈగా మదనపల్లెకు బదిలీ చేశారు. సత్యసాయిజిల్లా కదిరి ఈఈగా పని చేస్తున్న సీఆర్.రాజగోపాల్‌కు పూర్తి అదనపు బాధ్యతలతో మదనపల్లె ఎస్‌ఈగా ఇప్పటిదాకా పనిచేశారు. దీనితో ఆయన తిరిగి కదిరి ఈఈగా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఐటీతో ఉజ్వల భవిష్యత్తు

కలకడ:ఐటీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావల్లి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కలకడలోని ఆదర్శపాఠశాల ఇంటర్మీడియట్ విద్యార్థులకు సమగ్ర సర్వశిక్ష అభియాన్, ఇండ్రస్టీస్ ఎడ్యుకేషన్ నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు పథకాలపై శిక్షణ, ఉపాధి, ధ్రువపత్రాలు మంజూరు చేయడం వలన భవిషత్తులో ఎంతో ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. విద్యార్థులు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ కో ఆర్డినేటర్ యోగేష్, ట్రైనర్ విష్ణువర్ధన్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వంట నూనె మంట

- ఏడాదిలో లీటర్‌పై రూ.45 పెరుగుదల
- విలవిల్లాడుతున్న సామాన్యులు

వంట నూనెలు సలసల కాగుతున్నాయి. ఆ సెగలు సామాన్య, మధ్యతరగతి వారిని బెంబేలెత్తిస్తున్నాయి. అన్ని ధరలూ ఇలా పెరిగిపోతే ఇక జీవనం సాగేదెలా అంటూ నిట్టూరుస్తున్నారు.



మదనపల్లె సిటీ: వంటలకు రుచి వచ్చేది కమ్మని నూనె వాసనతోనే. అయితే ఆ వంటనూనెల ధరలు చుక్కలను తాకడంతో సామాన్యులు వాటిని అందుకోలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గత ఏడాదితో పోలిస్తే మార్కెట్‌లో నూనె ధరలు లీటరుకు రూ.25 నుంచి రూ.40 వరకు పెరిగాయి. ఇప్పటికే విద్యుత్‌చార్జీలు మోతమోగించగా నూనె ధరల మంటలతో వినియోగదారులు సలసల కాగిపోతున్నారు. దీంతో స్వీట్లు, హోటళ్లు, హాస్టల్ యజమానులు మెనూలో ధరలను అమాంతంగా పెంచేస్తున్నారు. గత ఏడాది చివరిలో కేంద్ర ప్రభుత్వం సన్‌ఫ్లవర్, సోయాబీన్, పామాయిల్ తదితర నూనెలపై దిగుమతి సుంకాలను 5.5 నుంచి 27.5 శాతానికి పెంచడంతో క్రమేణా ధరలు పెరుగుతూ వచ్చాయి. దిగుమతి సుంకాలు తగ్గిస్తే తప్ప నూనెల ధరలు చుక్కల నుంచి దిగిరావని వ్యాపారులు అంటున్నారు. ఇప్పటికీ రోజూ లీటర్ ప్యాకెట్లపై రూపాయి వంతున, 15 లీటర్ల డబ్బాలపై రూ.20 వరకు ధరలు పెరుగుతూ వినియోగదారులతో దోబూచులాడుతున్నారు. రాష్ట్రం ప్రభుత్వం వంట నూనెలను సబ్సిడీతో సరఫరా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

వంట నూనె ధరలు పెరుగుదల ఇలా....

2024 జనవరి		2025 జనవరి	
లీటరు	15 లీ.	లీటరు	15 లీ.
రూ.90	రూ.1250	రూ.135	రూ.2000

వంటలు ఎలా చేయాలి?



మాది మధ్య తరగతి కుటుంబం. నెలకు 4 ప్యాకెట్లు నూనె వినియోగిస్తాం. రెట్టింపు వాడవలసి ఉంది. పిండివంటలంటే నూనెతోనే పని. కానీ ధరలు మాత్రం 50 శాతం వరకు పెరిగాయి. వాడకం ఎంత తగ్గించగలం?

–లక్ష్మిదేవి, కాలేజీరోడ్డు, మదనపల్లె

ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేయాలి



ప్రభుత్వం వంటనూనెలను రేషన్‌డీపోల ద్వారా అందించాలి. ఇప్పటి వరకు స్పందించకపోవడం విచారకం. నూనెల ధరలు అమాంతంగా పెరగడంతో కొనుగోలు చేయాలంటే కష్టంగా ఉంది.

–రెడ్డమ్మ, అనపగుట్ట, మదనపల్లె

28 నుంచి భూముల రీసర్వే ప్రారంభం

మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్



బి.కొత్తకోట: భూముల రీసర్వే ఈనెల 28 నుంచి మొదలవుతుందని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. శుక్రవారం ఆయన బి.కొత్తకోట మండలంలోని గొళ్లపల్లె గ్రామంలో భూముల ఎల్‌పీఎం వెరిఫికేషన్ ఎలా చేస్తున్నారని తనిఖీ చేశారు. తర్వాత తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. ప్రతి వీఆర్‌ఓ పరిధిలో ఎన్ని రెవెన్యూ సదస్సు, స్పందన, రీసర్వేపై ఎన్ని ఫిర్యాదులు అందాయి, ఎన్నింటిని పరిష్కరించారు అన్న వివరాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్జీకి పరిష్కరించాలని, నిర్ణీత వ్యవధిలో పనులుపూర్తి చేయాలని ఆదేశించారు. ఫ్రీహోల్డ్ వివరాలను, వాటి రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మేఘస్వరూప్ మీడియాతో మాట్లాడుతూ 28 నుంచి భూముల రీసర్వే మొదలవుతుందని, ఇందులో మండలంలోని బయ్యప్పగారిపల్లెను మోడల్‌గా తీసుకుని సర్వే నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. సదస్సుల్లో అత్యధికంగా మదనపల్లె, బి.కొత్తకోటల్లో, తర్వాత నిమ్మనపల్లె, కురబలకోటల్లో ఫిర్యాదులు అందినట్టు చెప్పారు. ఫ్రీహోల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి నివేదికలు పంపామన్నారు. 45 రోజుల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇచ్చిన గడువు పూర్తికావడంతో మరో 45 రోజులు పొడిగించినట్టు చెప్పారు. చౌకదుకాణాల కేటాయింపుకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించి నెలాఖరులోగా డీలర్లను ఎంపిక చేస్తామన్నారు. పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్ టౌన్‌షిప్ కమిటీ సమావేశాన్ని త్వరలోనే నిర్వహిస్తామని చెప్పారు.

సాహిత్య సార్వభౌముడు కృష్ణదేవరాయులు


ర్యాలీ నిర్వహిస్తున్న బలిజసంఘం నాయకులు

పీలేరు : శ్రీ కృష్ణదేవరాయులు సాహిత్య సార్వభౌముడని బలిజ సంఘం నాయకులు కొనియాడారు. శుక్రవారం పీలేరులో శ్రీకృష్ణదేవరాయులు జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నవ నాగరికతను తన పరిపాలనా విధానాలతో కృష్ణదేవరాయులు నాంది పలికారని పేర్కొన్నారు. పీలేరులో శ్రీ కృష్ణదేవరాయుల విగ్రహ ప్రతిష్ఠకు స్థలం సేకరణ చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పెరిక బలిజ, గాజుల బలిజలకు కుల ధ్రువీకరణ పత్రాల అంశంలో న్యాయం చేయాలని కోరారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బలిజ సంఘం నాయకులు పోతంశెట్టి రమేష్, పసుపులేటి లక్ష్మీకర, డాక్టర్ మల్లికార్జున, పచ్చార వెంకటరమణ, పురుషోత్తం, సుబ్రమణ్యం, మనోహర, నాగేంద్ర, ప్రసాద్, రామకృష్ణ, మధు, శివ, పి.వి.ఎస్. లక్ష్మీ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై పోరాడుతాం


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు

పీలేరు రూరల్ : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై పోరాడుతామని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్యప్రకాష్, శ్రీరాములునాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పోస్టర్లు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఎక్కడైనా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పై దాడులు జరిగితే అందరూ ఐక్యమత్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయులు జనార్దన, పీరయ్య, సుధాకర్, ఓబయ్య, రమణ, హరి, మురళి, గోపీ, శ్రీరాములు నాయక్, సిద్ధయ్య పాల్గొన్నారు.

సామాజిక పింఛన్లు పరిశీలన


పింఛనుదారుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

పెద్దమండ్యం: మండలంలోని బండమీదపల్లె, వెలిగల్లు, శిద్దవరం గ్రామ సచివాలయాల పరిధిలో రూ.15 వేలు సామాజిక పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులను వైద్యుల బృందం శుక్రవారం పరిశీలించారు. బండమీదపల్లె గ్రామ సచివాలయం పరిధిలో ఐదుగురు, వెలిగల్లు సచివాలయం పరిధిలో 8 మంది, శిద్దవరం సచివాలయం పరిధిలో 10 మంది పింఛను దారులను పరిశీలించారు. నిబంధనల మేరకు పింఛనుదారుల స్థితిగతులపై ఆరా తీశారు. పింఛనుదారుల వికలత్వ సర్టిఫికెట్‌లు పరిశీలించారు. సదరం క్యాంపు ద్వారా ఎక్కడ వికలత్వం సర్టిఫికెట్‌లు పొందారనే విషయంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కడప రిమ్స్ హాస్పిటల్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు ఏ జ్యోత్స్న, సి. భాస్కరరావు, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, పీహెచ్‌సీ డాక్టర్ ఇమ్మానుయేల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: మండలంలో ఈనెల 21వతేదీ నుంచి మెడికల్ పెంఛన్ల తనిఖీ జరుగుతుందని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. 21న కుక్కరాజుపల్లె, కోటకొండ, రేణుమాకులపల్లె, కన్నెమడుగు, ఎద్దులవారిపల్లెలో 29 పెంఛన్లు, 22న కోసువారిపల్లె, బాలిరెడ్డిగారిపల్లె, తంబళ్లపల్లె–1లో 29 పెంఛన్లు, 23న గుండ్లపల్లి, చేలూరివారిపల్లె, గోపిదిన్నె, కోటాలలో 31 పెంఛన్లు తనిఖీ చేసి నివేదికలు ఉన్నతాధికారులకు పంపుతారని తెలిపారు.

రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలి


మాట్లాడుతున్న రోడ్డు రవాణా అధికారి అశోక్‌ప్రతాపరావు

మదనపల్లె సిటీ: డ్రైవర్లు రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని రోడ్డు రవాణా అధికారి డి.అశోక్‌ప్రతాపరావు అన్నారు. శుక్రవారం స్థానిక వన్ డిపో కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ఆర్టీసీ అంటే సురక్షిత ప్రయాణానికి మారుపేరన్నారు. డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు డ్రైవింగ్‌లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ప్రమాదాలు జరగకుండా ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. ఘాట్‌రోడ్డులో డ్రైవింగ్ చేసే సమయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నైట్ సర్వీసుకు వెళ్లే డ్రైవర్లలో కంటి చూపులో తేడా ఉన్న వారు విధులకు వెళ్లకుండా ఉండటం మంచిదన్నారు. కార్యక్రమంలో వన్ డిపో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

మా పాట మీ నోట..!

- నేడు 'దిల్ రుబా' సినీ సాంగ్ ప్రారంభం

కురబలకోట: యంగ్ సినీ హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రుక్సార్ ధిల్లాన్ నటించిన నూతన దిల్ రుబా సినిమా సాంగ్ మండలంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్, వైస్ ప్రిన్సిపాల్ రామనాథన్ తెలిపారు. ఈ సినిమాను ఫిబ్రవరి 14న వాలంటైన్స్‌డే సందర్భంగా రిలీజ్‌చేయనున్నట్లు సమాచారం.ముఖ్య అతిథితులుగా హీరో హీరోయిన్లు హాజరవుతున్నట్లు తెలిపారు..

నేడు ఉచిత గుండె పరీక్ష శిబిరం

మదనపల్లె : సత్సంగ్ ఫౌండేషన్, వైదేహి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని నక్కలదిన్నె స్వాస్థ్య హాస్పిటల్‌లో ఉచిత గుండె పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. వైదేహి హెడ్ ఆఫ్ కార్డియాక్ సైన్సెస్, సీనియర్ హార్ట్ సర్జన్ డాక్టర్ దుర్గాప్రసాద్‌రెడ్డి శిబిరంలో పాల్గొని రోగులకు చికిత్సలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈసీజీ, 2డి–ఎకో స్కాన్, బీపీ తదితర పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరానికి వచ్చే వారు కచ్చితంగా ఆధార్‌కార్డు తీసుకుని రావాలని సూచించారు.

తిరుమలకు పాదయాత్ర

రామసముద్రం : మండల సరిహద్దులోని కర్నాటక సోమయాజులపల్లె, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు శుక్రవారం రామసముద్రం మీదుగా తిరుమలకు పాదయాత్రగా వెళ్లారు. దాదాపు 400 మందికిపైగా భక్తులు తిరుమలకు వెళుతూ, రామసముద్రంలోని శ్రీ లక్ష్మీజనార్దనస్వామి ఆలయం, దిన్నెపల్లె సమీపంలోని గెవితిమ్మరాయస్వామి ముఖ ద్వారం వద్ద పూజలు చేశారు. 8 ఏళ్లుగా ప్రతి సంవత్సరం జనవరిలో పాదయాత్రగా వెళ్లి స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీగా పెట్టుకున్నామని భక్తులు వెంకటేష్, నాగరాజ, సురేష్, రాజన్న, మంజు, శివ, నాగప్ప, వెంకటమ్మ, లక్ష్మి, గోవిందమ్మ, రాజారెడ్డి చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలి


ఆర్జేడీకి చిత్రపటం అందజేస్తున్న డాక్టర్‌సేతు, చంద్రమోహన్‌రెడ్డి

మదనపల్లె సిటీ: ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని కడప ఆర్జేడీ కె.శామ్యూల్‌ను శుక్రవారం మదనపల్లెకు చెందిన విజయభారతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.సేతు వినతిపత్రం అందజేశారు. ఆర్జేడీగా పదవీ బాధ్యతలు చేపట్టిన శ్యాముల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి చిత్రపటం అందించారు. ప్రైవేటు విద్యా సంస్థల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యా సంస్థ నిర్వాహకులు చంద్రమోహన్‌రెడ్డి ఉన్నారు.

భువనేశ్వరికి పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని భుజంగేశ్వర ఆలయంలో వెలసి ఉన్న భువనేశ్వరీ దేవికి శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అలంకరించారు. రాత్రి అమ్మవారికి భజన బృందం ఆధ్వర్యంలో భజనలు ఏర్పాటు చేశాయి.

అన్నదాతలకు ప్రీతిపాత్రమైన పండుగ కనుమ

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్
- చిప్పిలిలో వైభవంగా కనుమ వేడుకలు


నిసార్‌అహ్మద్‌ను సత్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

మదనపల్లె : అన్నదాతలకు అత్యంత ప్రీతిపాత్రమైన పండుగ కనుమ అని, పాడిపంటలతో పచ్చగా కళకళలాడాలంటూ పశువులకు పూజచేయడమే పండగ పరమార్థమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. సంక్రాంతి పండుగలో భాగంగా శుక్రవారం కనుమ వేడుకలను చిప్పిలిలో రైతులు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన వేడుకల్లో నిసార్‌అహ్మద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గోపూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట చేతికి వచ్చేందుకు రైతులు ఎంతో కష్టపడుతారని, ఆ కష్టంలో పశువుల సాయం వెలకట్టలేనిదన్నారు. యజమాని ఆనందం కోసం అవి ఎంతగానో శ్రమిస్తాయని, వ్యవసాయంలోనే కాకుండా పాడి ద్వారా కూడా గోమాతలు రైతన్నను ఆర్థికంగా ఆదుకుంటాయన్నారు. తమ సంపదలకూ, సంతోషాలకూ కారణమైన పశువులను కృతజ్ఞతతో పూజించడమే కనుమ పండుగ ముఖ్య ఉద్దేశమన్నారు. కనుమ రోజు రైతన్నలు ఆవులు, ఎద్దులతో తమకున్న అనుబంధాన్ని చాటుకుంటారన్నారు. ఇలాంటి వేడుకలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, పల్లెసీమలు పాడిపంటలతో, రైతులు సుఖసంతోషాలతో నిత్యం కళకళలాడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంకిశెట్టిపల్లె సర్పంచ్ శరత్, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, చిప్పిలి మల్లికార్జునరెడ్డి, మునిశేఖర్, కొత్తపల్లె మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ


మాట్లాడుతున్న సాంబశివ

మదనపల్లె : కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక సంతగేటు ఏఐటీయూసీ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కమిటీ అధ్యక్షుడు సురేష్‌కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ జిల్లాల విభజన తర్వాత అరకొరగా ఉన్న పరిశ్రమలు తిరుపతి జిల్లాలో ఉండిపోయాయని, అన్నమయ్యజిల్లాలో నూతన పరిశ్రమలు ఏర్పాటుచేసి కార్మిక కుటుంబాలకు ఉపాధి కల్పించడంలో జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రి వైఫల్యం చెందారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడునెలలు దాటినా నేటికీ జిల్లాలో ఒక పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదని, పరిశ్రమల ఏర్పాటు కోసం ఏఐటీయూసీ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్ వర్కర్స్ చేపట్టిన ఆందోళనల సందర్భంగా నేటి కూటమినాయకులు ఇచ్చిన హామీల ప్రకారం సమ్మెకాలపు హామీలు అమలుచేయడంలో విఫలమయ్యారన్నారు. జిల్లాలో పారిశుద్ధ్యపనులు చేస్తూ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న మున్సిపల్ వర్కర్స్‌కు ఇంటిస్థలాలు ఇవ్వాలన్నారు. మున్సిపల్, కార్పొరేషన్లలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, కాంట్రాక్ట్, డైలీ, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్‌ను పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా, మిడ్‌డే మీల్స్, ప్రభుత్వ పాఠశాలల ఆయాలకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, చిరుద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మదనపల్లె మున్సిపాలిటీ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్‌కుమార్, నాగరాజు, గౌరవసలహాదారులు మస్తాన్, పృథ్వీరాజ్, నాగరాజు, ఓబులేసు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి


మాట్లాడుతున్న ఏపీడీ మధుబాబు

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులలో కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ మధుబాబు ఆదేశించారు. శుక్రవారం స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది. గ్రామాల వారీ జరుగుతున్న పనులు, కూలీలకు చెల్లించాల్సిన బిల్లులు తదితర అంశాలపై ఆరా తీశారు. మండల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు సమ్వనయంతో గ్రామాలలో కూలీలను గ్రూపులు చేసి పనులు కల్పించాలన్నారు. ఒక్కో గ్రూపులో 10 నుంచి 30 మంది కూలీలను గ్రూపులుగా చేసి వారు కోరిన పనులు చూపెట్టాలన్నారు. జరిగిన పనులకు వెంటనే కొలతలు తీసి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా గోకులం షెడ్లు నిర్మాణపు పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ నెలలో 10 గోకులం షెడ్లు నిర్మాణంకు నివేదికలు పంపామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ అంజనప్ప, ఉపాధి ఇంజినీర్ రామన్న, మండల టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుదాం


బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పీలేరు : సమిష్టి కృషితో బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుదామని లేబర్ ఆఫీసర్ ఆనందబాబు అన్నారు. శుక్రవారం పాన్ ఇండియా బాలకార్మిక నిర్మూలన, పునరావాస కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాలకార్మిక చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా నేరమని, ప్రోత్సహించిన వారికి చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం ప్రకారం బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలన్నారు. వలస వచ్చిన వారికి విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామని తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత డిపోగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న ఎంవీఐ విజయకుమారి

పీలేరు రూరల్ : పీలేరు ఏపీఎస్ ఆర్టీసీ డిపోను ప్రమాద రహిత డిపోగా తీర్చి దిద్దాలని ఎంవీఐ విజయకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక గ్యారేజీలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైవర్లు మానసిక ప్రశాంతతో విధులకు హాజరు కావాలన్నారు. దురాలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మద్యంసేవించి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని తెలిపారు. రోడ్డు నియమాలు విధిగా పాటించలని తెలిపారు. డీఎం కుమార్ మాట్లాడుతూ జీరో ప్రమాదాలు లక్ష్యంగా ప్రతి డ్రైవర్, మెకానిక్‌లు పని చేయాలన్నారు. గత ఏడాది పీలేరు డిపో పరిధిలో 5 ప్రమాదాలు జరిగితే ఇద్దరు చనిపోయారని తెలిపారు. ఆర్టీసీ ప్రయాణమే ప్రయాణీకులకు సురక్షితమనే నమ్మకం కల్గించాలన్నారు. సీఐ సుబ్బమ్మ, సూపర్‌వైజర్లు హబీబుల్లా, బాలసుబ్రమణ్యం, డ్రైవర్లు పాల్గొన్నారు.

టీడీపీలో త్రీమెన్ గోల!

- సింగిల్‌విండో కమిటీలకు జయచంద్రారెడ్డి, సీనియర్ల వేర్వేరు జాబితాలు
- కుదరని సయోధ్య



బి.కొత్తకోట: వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సింగిల్‌విండో)ఎన్నికలు నిర్వహించకుండా ముగ్గురు సభ్యులతో త్రీమెన్ కమిటీలను నియమించి వారిలో ఒకరిని చైర్మన్ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించి ఏ మండలానికి ఎవరిని నియమించాలో నివేదికలు సమర్పించాలని టీడీపీ అధిష్టానం సూచించింది. అయితే నియోజకవర్గ టీడీపీలో నెలకొన్న విభేదాలు, వర్గపోరుతో సమన్వయం కోసం పార్టీ నుంచి గురువారెడ్డిని పరిశీలకుడిగా పంపగా గురువారం నియోజకవర్గంలో పర్యటించి జయచంద్రారెడ్డి, సీనియర్లను వేర్వేరుగా కలిసి సమావేశాలు నిర్వహించినా వారి మధ్య సయోధ్య కుదరలేదు. దీనితో ఎవరికి వర్గం వారు తగ్గేదే లేదంటూ జాబితాలు సమర్పించడంతో పార్టీలో ఎవరిది పైచేయి అవుతుందన్న ఉత్కంఠ నెలకొంది.

వేర్వేరు జాబితాలు

గత ఎన్నికల్లో ఓడిపోయిన టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి ఆరు మండలాలకు సంబంధించి ఒక్కో మండలం నుంచి ముగ్గురు టీడీపీ నేతల పేర్లు, వారిలో ఒకరిని చైర్మన్‌గా పేర్కొంటూ పార్టీకి జాబితాలు పంపారు. వీటిలో బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాలకు సంబంధించి సీనియర్ నాయకుల పేర్లను ప్రతిపాదించి చైర్మన్ పదవిని ఇచ్చేందుకు ప్రతిపాదించగా వారు తిరస్కరించారు. జయచంద్రారెడ్డి సొంత మండలమైన ములకలచెరువుకు పేర్లను సిఫార్సు చేయగా దీనికి పోటీగా మండల కన్వీనర్ పాలగిరి సిద్దా ఆరుగురి పేర్లను సిఫార్సు చేశారు. పెద్దమండ్యం, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల పరిస్థితి ఇదే కావడంతో జయచంద్రారెడ్డిని వ్యతిరేకిస్తున్న మండల కన్వీనర్లు దాసిరిపల్లి నారాయణస్వామిరెడ్డి, ఆనందరెడ్డి, పాలగిరి సిద్దా, బిల్డర్ రమణలు ఒక్కో మండలం నుంచి ఆరు నుంచి పది మంది పేర్లతో జాబితాను పంపారు. దీనికి ముందు పార్టీ క్యాడర్‌తో సమావేశాలు నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నారు. రెండు జాబితాలతో పార్టీ ఏ నిర్ణయం తీసుకోలేక వీరి మధ్య సమన్వయం కోసం పార్టీ పరిశీలకుడిని పంపినా ఫలితం లేకుండాపోయింది.

కలవలేమంటూ తేల్చిన సీనియర్లు: జయచంద్రారెడ్డి ప్రతిపాదించిన పేర్లను అంగీకరించమని టీడీపీ సీనియర్లు, నాలుగు మండలాల కన్వీనర్లు పార్టీ పరిశీలకుడు గురువారెడ్డికి తేల్చి చెప్పేశారు. తాము ఇచ్చిన జాబితా మేరకు త్రీమెన్ కమిటీలు వేయాలని కోరారు. ఈ మేరకు జయచంద్రారెడ్డితో గురువారెడ్డి సమావేశమై చర్చించారు. తర్వాత అన్ని మండలాల్లో పర్యటించిన గురువారం రాత్రి బి.కొత్తకోటలో పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాలకు చెందిన కన్వీనర్లు, సీనియర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 174 నియోజకవర్గాల్లో లేని సమస్య తంబళ్లపల్లిలో ఉందని అన్నారు. సమన్వయం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించక టీడీపీ సీనియర్లు ఇచ్చిన జాబితాలను తీసుకుని రెండు జాబితాలను అధిష్టానంకు సమర్పిస్తామని తుది నిర్ణయం వారిదేనని చెప్పి వెనుదిరిగారు.